సాక్షి
చిత్తూరు
మంగళవారం ၊ 22 ၊ జూలై ၊ 2025



సమస్యల హోరు..

చిత్తూరు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు అర్జీదారులు క్యూ కట్టారు. - 10లో



పోలీస్ గ్రీవెన్స్‌కు 38 ఫిర్యాదులు

చిత్తూరులోని ఎస్పీ కార్యాలయంలో జరిగిన పోలీస్ గ్రీవెన్స్‌కు 38 ఫిర్యాదులు వచ్చినట్టు పోలీసులు తెలిపారు. - 10లో



హామీలు తూచ్

కూటమి ప్రభుత్వం మామిడి రైతులను ముంచేసింది. మద్దతు ధర ఇవ్వకుండా సర్వనాశనం చేసింది. - 10లో

న్యూస్‌రీల్

పంట పొలాలపై ఆగని గజ దాడులు



ఆవుల పెద్దిరెడ్డిగారిపల్లెలో ఏనుగులు తొక్కేసిన టమాట పంట

పులిచెర్ల(కల్లూరు): మండలంలో రోజూ ఏదో ఒకచోట పంట పొలాలపై ఏనుగులు దాడికి తెగబడుతున్నాయి. కొన్ని నెలలుగా ఇక్కడే తిష్ట వేసి పంటలను నాశనం చేస్తున్నాయి. సోమవారం ఉదయం మండలంలోని ఆవుల పెద్దిరెడ్డిగారిపల్లె, కురవపల్లె, చిట్టారెడ్డిపేట, పాతపేట పరిసర ప్రాంతాల్లో ఏనుగుల మంద పంటలను ధ్వంసం చేసింది. ఆవుల పెద్దిరెడ్డిగారిపల్లెలో చామంచుల కోదండయ్య టమాట పంటను తొక్కిపడేశాయి. పశువుల మేత కోసం వేసిన గడ్డి, వరి నారును నాశనం చేశాయి. తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

జీవన ఎరువుల పంపిణీ



రైతులకు జీవన ఎరువులను పంపిణీ చేస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని రైతులకు క్షేత్రస్థాయిలో జీవన ఎరువల వల్ల కలిగే లాభాలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జీవన ఎరువుల మందుల పంపిణీ, అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జీవన ఎరువులను వినియోగించడంతో పంటలకు బలం వస్తుందన్నారు. జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పడాల్, డీఆర్వో మోహన్‌కుమార్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ పాల్గొన్నారు.

నర్సింగ్ ఉద్యోగావకాశాలు



విక్రమ్‌కుమార్‌రెడ్డి, ఎస్సీ వెల్ఫేర్ డీడీ

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో నర్సింగ్ పూర్తి చేసిన ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులకు ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఎస్సీ వెల్ఫేర్ డీడీ విక్రమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. జర్మనీ వంటి దేశాల్లో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలోని మూడు కేంద్రాల్లో ఒక్కో కేంద్రంలో 50 మంది చొప్పున జర్మన్ లాంగ్వేజ్‌లో బీఎస్సీ, జీఎన్‌ఎం నర్సింగ్‌లో డిగ్రీ పట్టా ఉన్న ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఉచిత వసతితో పాటు శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. తిరుపతి జిల్లా కేంద్రంలో శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం అనుమతిచ్చిందన్నారు. బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేసి, రెండేళ్ల క్లినికల్ అనుభవం, జీఎస్ఎం నర్సింగ్ పూర్తిచేసి మూడేళ్ల క్లినికల్ అనుభవం ఉన్న ఎస్సీ,ఎస్టీ మహిళలు శిక్షణకు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులను dscweotpt@ gmail. com, ddswctr@gmail.com మెయిల్ చేయాలన్నారు. ఇతర వివరాలకు 80083 59664, 8790654826, 9959534669 నెంబర్లలో సంప్రదించాలని డీడీ కోరారు.

కూటమి కుట్రపై.. జనాగ్రహం



ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును నిరసిస్తూ పుంగనూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు

రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి అక్రమ అరెస్ట్‌పై నిరసనలు హోరెత్తించారు. సోమవారం తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు ఆందోళనలు మిన్నంటించారు. కూటమి కుట్రలపై కన్నెర్రజేశారు. జిల్లాలో సీఎం చంద్రబాబుకు ఎదురులేకుండా ఉండేందుకే పెద్దిరెడ్డి కుటుంబాన్ని అణగదొక్కుతున్నారని ధ్వజమెత్తారు. అందులో భాగంగానే జరగని కుంభకోణాన్ని జరిగినట్టు సృష్టించి మద్యం స్కామ్‌లో ఎంపీని ఇరికించారని విరుచుకుపడ్డారు. ప్రజల తరఫున పోరాడే నాయకులపై కేసులు పెట్టి జైళ్లకు పంపడం కూటమికి అలవాటుగా మారిందన్నారు. అరెస్ట్‌లపై ఉన్న శ్రద్ధ హామీల అమలుపై లేదని మండిపడ్డారు. కూటమి కుట్రలు పటాపంచలయ్యే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. రానున్నది జగనన్న ప్రభుత్వమేనని, వడ్డీతో సహా చెల్లిస్తామని స్పష్టం చేశారు.

– సైదాపురం/శ్రీకాళహస్తి/ తిరుపతి మంగళం

ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అరెస్ట్‌పై నిరసన జ్వాల

- చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో మిన్నంటిన ఆందోళనలు
- పెద్దిరెడ్డి కుటుంబాన్ని అణగదొక్కడానికే అక్రమ అరెస్ట్
- జిల్లాలో ఎదురులేకుండా బాబు కుట్ర
- ధ్వజమెత్తిన వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు

లిక్కర్ స్కామ్ పేరుతో అక్రమ అరెస్టు



ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్ట్‌ని ఖండిస్తున్నా. కూటమి కక్షపూరిత రాజకీయాలు ఎల్లకాలం సాగవు. కూటమి అరాచకాలపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి. సీఎం చంద్రబాబు కక్ష పూరిత రాజకీయాలు చేస్తున్నారు. లిక్కర్ స్కామ్ అనేది ఒట్టి అభూతకల్పన. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న జనాదరణ చూసి ఓర్వలేక ఆయన్ను బలహీనపరిచేందుకు కుట్రపన్నుతున్నారు. ఇప్పటి వరకు మద్యం అక్రమ కేసులో అరెస్ట్ చేసిన మా పార్టీ నేతలపై ఎలాంటి ఆధారాలూ చూపలేదు. కూటమిపై ప్రజా తిరుగుబాటు మొదలవుతుంది. అక్రమ అరెస్టులకు మా పార్టీ నేతలెవ్వరూ భయపడరు.

– బియ్యపు మధుసూదన్‌రెడ్డి, శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే

ఎంపీ అరెస్ట్ దారుణం



ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారు. ఇది దారుణం. కూటమి ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తోంది. భూటకపు స్కామ్‌ని అంటగట్టారు. పారదర్శకంగా అమలు చేసిన మద్యం విధానంపై అక్రమ కేసులు బనాయించి ఇరికించారు. రెడ్ బుక్ రాజ్యాంగంలో భాగంగానే ఈ కుట్ర సాగుతోంది. చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ సాగిస్తున్నారు. ఆయన సొంత జిల్లా చిత్తూరులో వైఎస్సార్‌సీపీకి బలమైన నేతలుగా ఉన్న పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతోనే ఎంపీని అరెస్ట్ చేశారు. ఇలాంటి రాజకీయాలు మానుకోండి.

– నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త

బాబును మించిన నేరస్తుడు దేశంలోనే లేరు



దేశంలో మద్యం కుంభకోణాలు చేయడంలో చంద్రబాబుకు మించిన నేరస్తుడు మరొకరు లేరు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అక్రమ అరెస్ట్ దారుణం. మద్యం కుంభకోణాల్లోనూ, ఓటుకు నోటు కేసుల్లోనూ చంద్రబాబుకు మించిన అక్రమార్కుడు ఎవ్వరూ లేరు. వైఎస్సార్‌సీపీ హయాంలో లిక్కర్ స్కామ్‌లంటూ చంద్రబాబు అభూత కల్పన సృష్టించి తన ఎల్లో మీడియాల్లో ప్రాపగండం చేశారు. వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపుతున్నారు. సౌమ్యుడైన ఎంపీ మిథునన్నని అరెస్ట్ చేయడం దుర్మార్గం.

– భూమన అభినయ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త



తవణంపల్లె: ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును ఖండిస్తూ అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్, పార్టీ నేతలు

తవణంపల్లె: కూటమి హామీలను ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులతో విర్రవీగిపోతున్నారని వైఎస్సార్‌సీపీ పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డిపై లిక్కర్ కేసును సృష్టించి అక్రమంగా అరెస్టు చేయడం పిరికిపంద చర్య అని ధ్వజమెత్తారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రమైన తవణంపల్లెలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలదండ వేసి నివాళి అర్పించారు. ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని మండిపడ్డారు. అనంతరం డాక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకిచ్చిన సూపర్‌సిక్స్ పథకాలను గాలికొదిలేశారని దుయ్యబట్టారు. టీడీపీ నాయకులు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని విరుచుకుపడ్డారు. కూటమి పాలనలో కక్షసాధింపు చర్యలు తీవ్రమయ్యాయన్నారు. తప్పుడు కేసులు బనాయించి పైశాచికానందాన్ని పొందుతున్నారని ధ్వజమెత్తారు. పెద్దిరెడ్డి కుటుంబాన్ని టార్గెట్ చేయడం దుర్మార్గమన్నారు. ఎన్ని తప్పుడు కేసులు బనాయించినా కడిగిన ముత్యంలా బయటకు వస్తారని చెప్పారు. మిథున్‌రెడ్డి నేతృత్వంలోనే కూటమి కోటలను బద్దలు కొడతామన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు హరిరెడ్డి, రామచంద్రారెడ్డి, బుజ్జిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ధనంజయరెడ్డి, నియోజకవర్గ పార్టీ నాయకులు తలపులపల్లె బాబురెడ్డి, కుమార్‌రాజా, రాజారత్నంరెడ్డి, శిరీష్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి, తవణంపల్లె ఎంపీపీ ప్రతాప్‌సందర్‌రాయల్ రెడ్డి, పరమేశ్వరరెడ్డి, మధుకుమార్, ప్రకాష్‌రెడ్డి, గణేష్‌రెడ్డి, కిషోర్‌కుమార్ రెడ్డి, జయచంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేకే..



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని ఇచ్చి నల్లబ్యాడ్జీతో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

పలమనేరు: పెద్దిరెడ్డి కుటుంబాన్ని రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేకనే చంద్రబాబు లిక్కర్ కేసులో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని ఇరికించారని, ఇలాంటి తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తే లేదని పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. పలమనేరు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలను ధరించి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో రాష్ట్రంలో 4,380 లిక్కర్ షాపులు ప్రైవేటు వారు నిర్వహించారని చెప్పారు. ఇందులో 40వేల బెల్టుషాపులు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో 20 డిస్టలరీలు ఉంటే వాటిల్లో చంద్రబాబునాయుడు ఐదింటికి మాత్రం 70 శాతం ఆర్డర్లు ఇచ్చి, మిగిలిన వాటికి 30శాతం ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. లిక్కర్ కుంభకోణంలో ఓ టీడీపీ నాయకుడు ఆకాశరామన్న లేఖ రాశాడని దానిపై వారం రోజుల్లోనే విచారణ జరిపి కేసు పెట్టించారన్నారు. గత ప్రభుత్వంలో మద్యం అమ్మకాల్లో అక్రమాలు జరుగుంటే రూ.26వేల కోట్ల ఆదాయం ప్రభుత్వానికి ఎలా వచ్చిందన్నారు. ఇలాంటి తప్పుడు కేసులకు వైఎస్సార్‌సీపీ నాయకులు భయపడే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, పట్టణ కన్వీనర్ హేమంత్‌కుమార్‌రెడ్డి, నాయకులు దయానందగౌడ, తమీమ్, ప్రహ్లాద, జాఫర్, చలపతి రెడ్డి, చెంగారెడ్డి, మురళీకృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, పార్టీ అన్ని విభాగాల నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టుతో అణగదొక్కలేరు



నిరసన వ్యక్తం చేస్తున్న విజయానందరెడ్డి, చంద్రశేఖర్, కేపీ శ్రీధర్, గాయత్రీదేవి,జ్ఞానజగదీష్, నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టుకు నిరసనగా వైఎస్సార్‌సీపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం రాత్రి గాంధీ విగ్రహం వద్ద ఆ పార్టీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఉయ్ స్టాండ్ ఫర్ మిథున్‌రెడ్డి అంటూ ప్లకార్డులు చేతబట్టి నినాదాలు మిన్నటించారు. అనంతరం మీడియాతో విజయానందరెడ్డి, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ మాట్లాడారు. జగనన్నకు సన్నిహితంగా ఉండే నాయకుల పై కూటమి ప్రభుత్వం కక్షగట్టిందన్నారు. పార్లమెంట్ సభ్యుడికి రాష్ట్రంలో జరిగిందంటున్న స్కాంకు సంబంధమేమిటని ప్రశ్నించారు. రాయలసీమలో బలమైన నాయకుడు అయిన పెద్దిరెడ్డిని మానసికంగా ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని చెప్పారు. రాజకీయాల్లో హుందాగా వ్యవహరించే మిథున్‌పై ఆరోపణలు పేరిట కేసుల్లో ఇరికించాలని చూడడం అన్యాయమన్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా వైఎస్సార్‌సీపీకి మరింత ఆదరణ పెరుగుతుందే తప్ప తగ్గదన్నారు నగర పార్టీ అధ్యక్షుడు కేపీ శ్రీధర్, రాష్ట్ర మహిళ విభాగం ప్రధాన కార్యదర్శి గాయత్రీదేవి, ఉద్యోగులు, పెన్షనర్ల విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయసింహారెడ్డి, మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్, గుడిపాల పార్టీ అధ్యక్షుడు ప్రకాష్, నాయకులు, ప్రజాప్రతినిధులు బాబునాయుడు, త్యాగ, రజనీకాంత్, మధుసూదన్, ప్రసాద్‌రెడ్డి, అంజలి రెడ్డి, భాగ్యలక్ష్మిరెడ్డి, ప్రతిమారెడ్డి, హరీషారెడ్డి, నారాయణ, మురళీరెడ్డి, మనోజ్‌రెడ్డి, అప్పాజీ, అను, అల్తాఫ్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ హేయమైన చర్య



మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట: ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయడం కూటమి ప్రభుత్వ కుట్రపూరిత, కక్షపూరిత రాజకీయంలో భాగమేనని సూళ్లూరుపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కిలివేటివ సంజీవయ్య ధ్వజమెత్తారు. సోమవారం ఆయన సూళ్లూరుపేట వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆయన మాటల్లోనే..'అక్రమ మద్యం కేసు అని.. దానికి ఎలాంటి మూలాలు లేకుండా, సాక్ష్యాధారాలు లేకుండా బోడిగుండుకు మోకాలికి ముడివేసినట్టుగా ఉంది. జగనన్నకు అండగా నిలిచిన వారి పేర్లను రెడ్‌బుక్‌లో రాసుకుని వారినే టార్గెట్ చేసి అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపిస్తున్నారు. సిట్ అధికారులు చంద్రబాబు, లోకేష్ చెప్పింది చెప్పినట్టుగా విని అక్రమ అరెస్ట్‌లకు పాల్పడుతున్నారు. చంద్రబాబు మద్యం వ్యాపారాన్ని అక్రమంగా చేసిన వ్యక్తి కాదా!. డిస్టలరీలు, వివిధ రకాలైన బ్రాండ్లు తీసుకొచ్చి ప్రయివేట్ ముసుగులో మోసం చేయలేదా?. బెల్టుషాపులు నిర్వహించి గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించలేదా..? దీనిపై ఆయనపై కేసు పెడితే ప్రస్తుతం ఆయన బెయిల్ మీదే ఉన్నారు. ఈ విషయాన్ని గుర్తు చేసుకోవాలి'..అని చెప్పారు.

ఈవీఎంల ట్యాంపరింగ్ చేయలేదా?

ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసి అధికారంలో వచ్చాక రెడ్‌బుక్ పాలన చేస్తున్న పెద్దబాబు, చిన్నబాబుకు ముందుంది ముసళ్ల పండుగ అని సంజీవయ్య అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయకుండా కేవలం వైఎస్సార్‌సీపీ పార్టీ నాయకులనే లక్ష్యంగా చేసుకుని అరెస్టులు మీద అరెస్టులు చేస్తూ నియంతృత్వ పోకడలతో పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జెట్టి వేణుయాదవ్, చిన్న సత్యనారాయణ, స్వామిరెడ్డి, బందిలి మహేష్ అయితా శ్రీధర్, వాకాటి బాబురెడ్డి, నందారెడ్డి, హుస్సేన్, జయకుమార్, పర్వతరెడ్డి రవిరెడ్డి, చిలకా యుగంధర్, సురేష్ పాల్గొన్నారు.

ఏమైనా చేసుకోండి.. కిక్కు వాటా పెంచండి!



'చూడండి. ఎన్నికల్లో రూ.కోట్లు ఖర్చు చేశా. చేతిలో డబ్బులు, అప్పులు చేసింది తిరిగి సంపాదించుకోవాలి కదా. మీ సర్కిల్‌లో ఇప్పటి వరకు ఇస్తా ఉండేది చాలదు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి వేరే లెక్క ఇవ్వాలి. అవసరమైతే మీకు వచ్చేదాంట్లో తగ్గించుకోండి..'

– ఓ ఎక్సైజ్ అధికారికి చిత్తూరు జిల్లాలోని ఓ ప్రజాప్రతినిధి హుకుం

'చూడయ్యా..! నెలకు నువ్వు ఇచ్చేదే షాపునకు రూ.4 వేలు. ఏదో నాయకుడు అడిగాడు అని.. నా దాంట్లో తగ్గిస్తే ఎట్లా చెప్పు. నీ బాధలు ఏమైనా ఉంటే నువ్వే పడు. నేనేమీ బాస్ లాగా మొత్తం నాకే ఇవ్వమని చెప్పలేదు కదా. నాకు ఫ్యామిలీ ఉంది. ఖర్చులు ఉన్నాయి. మొన్న మంత్రి వచ్చిన రోజు ప్రొటోకాల్ ఖర్చు ఎంతయ్యిందో నీకు తెలియదా..? దయచేసి నా వాటా మాత్రం తగ్గించొద్దు.'

– ఓ ఉన్నతాధికారి నుంచి సీఐకి అందిన మౌఖిక ఆదేశం

- అబ్కారీ అధికారులపై కూటమి నేతల ఒత్తిళ్లు
- నెలవారి మామూళ్లు పెంచాలని పలుచోట్ల హుకుం
- తమ ఆదాయంలో తగ్గించుకోమంటున్న 'ఎక్సైజ్'
- జిల్లాను వదలి.. పక్క జిల్లాల వైపు వెళ్లేందుకు కూడా సిద్ధమవుతున్న అధికారులు

చిత్తూరు అర్బన్: 'కరవమంటే కప్పకి కోపం..విడవమంటే పాముకి కోపం' అన్నట్లు తయారైంది జిల్లాలోని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ అధికారుల పరిస్థితి. ఓ వైపు నెలవారి మామూళ్లు పెంచమని కూటమి నేతలు.. ఇస్తే ఇచ్చుకోండి, కానీ మాకు ఇచ్చేదాంట్లో మాత్రం చెయ్యి పెట్టొద్దంటూ ఓ అధికారి నుంచి ఆదేశాలు అందడంతో పలువురు సీఐలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. జిల్లాలో ప్రైవేటు దుకాణాల ద్వారా ఏరులైపారుతున్న మద్యం ప్రవాహంలో ఎవరికి కావాల్సినంత వాళ్లు యథేచ్ఛగా దోచుకుంటున్నారు.

దొందూ దొందే

అధికారులు వసూలు చేసి ఇస్తున్న మామూళ్లలో పబ్బం గడుపుకుంటున్న కొందరు నేతలు ఉన్నట్టుండి తమ వాటా పెంచాలని కోరడం.. అధికారులకు మింగుడుపడడం లేదు. కింది స్థాయిలో నెలవారీ మామూళ్ల చేసే అధికారులు, ఈ మొత్తం నుంచి అందరికీ పంచిపెట్టి చివర్లో మిగిలిన చిల్లర జేబుల్లో వేసుకోవడానికి ఇష్టపడడం లేదు. ఇటీవల చిత్తూరులోని ఓ ఉన్నతాధికారి వద్ద దీనిపై పంచాయితీ జరిగినట్లు తెలిసింది. ఆయన తనకిచ్చే నెలవారీ మామూళ్ల నుంచి రూపాయి తగ్గించుకున్నా ఒప్పుకునేదిలేదని చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. కావాలంటే నేతలకు ఇచ్చే దాంట్లో తగ్గించుకోమని సలహా ఇచ్చినట్లు తెలిసింది.

ఇమడలేక 'ఎక్సైజ్'

ఓ వైపు సొంత శాఖలోని అధికారులు, మరో వైపు నేతలు సతాయిస్తుండడంతో నాలుగు సర్కిళ్ల నుంచి సీఐలు, ఓ ఉన్నతాధికారి జిల్లాను వీడడానికి సిద్ధమైనట్టు తెలిసింది. కర్నూలు, అనంతపురం, కడప జిల్లాలకు వెళ్లిపోవడానికి అక్కడి నేతలతో రాయబారం నడుపుతున్నట్లు సమాచారం. ఓ వైపు నవోదయం, మరోవైపు నాటుసారాపై ఉక్కుపాదం, జిల్లా కేంద్రంలో ప్రోటో కాల్స్ లాంటి వాటితో ఇబ్బందులు పడుతుంటే.. తాజాగా వాటాలు పెంచమని ఆదేశిస్తే ఇక్కడ పనిచేయలేమని కొందరు ఖాకీలు తేల్చి చెబుతున్నారు.

ఎవరి వాటా వాళ్లదే

జిల్లాలో మొత్తం 113 మద్యం దుకాణాలున్నాయి. గతేడాది అక్టోబర్‌లో ప్రారంభమైన నూతన మద్యం పాలసీలో ఇప్పటి వరకు దాదాపు రూ.300 కోట్ల ఆదాయం చేకూరింది. జిల్లాలో ఎనిమిది ఎక్సైజ్ సర్కిళ్లు ఉంటే.. నెలకు కొన్నిచోట్ల దుకాణానికి రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు వసూలు చేస్తున్నారు. మరికొన్ని చోట్ల రూ.15 వేల నుంచి రూ.18 వేలు వసూలు చేస్తున్నారు. సగటున ఒక్కో దుకాణం నుంచి రూ.25 వేలు అనుకున్నా.. నెలకు రూ.28 లక్షల వరకు వసూలవుతోంది. గత పది నెలల్లో రూ.2.8 కోట్లకు పైనే వసూలు చేశారు. ఇందులో ఓ అధికారికి దుకాణానికి రూ.4 వేలు, మరో అధికారికి షాపునకు రూ.2 వేలు, ఇంకొకరికి రూ.వెయ్యి చొప్పున ఇవ్వాలి. ఇది కాకుండా కూటమి నేతల్లో కొందరికి ఒక్కో దుకాణానికి రూ.5 వేలు ఇవ్వాలి. కొందరు నేతలు ఈ మొత్తం తీసుకోకుండా, దానికి సరిపడే ఆర్థికపరమైన బాధ్యతలను అధికారులకు అప్పగిస్తున్నారు. మిగిలిన దాంట్లో స్టేషన్‌లోని వాహనాలకు డీజిలు, స్టేషన్ నిర్వహణ చూసుకోవాలి. ఇది కాకుండా మద్యం బార్ల నుంచి అందే నెలవారీ మామూళ్లు అధనం.

మామిడి రైతులకు రూ.150 కోట్ల సబ్సిడీ



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని మామిడి రైతులకు ప్రభుత్వం రూ.150 కోట్ల సబ్సిడీని అందజేస్తోందని కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు సేకరించిన మామిడికి రాష్ట్ర ప్రభుత్వం రూ.4 చొప్పున సబ్సిడీ అందజేస్తుందన్నారు. ప్రభుత్వం అందజేసే రూ.150 కోట్ల సబ్సిడీని రైతుల ఖాతాలకు జమచేసేలా పకడ్బందీ చర్యలు చేపడుతున్నామన్నారు. సబ్సిడీ దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత మండల అధికారులదేనని స్పష్టం చేశారు. జూన్ నెలాఖరు వరకు సేకరించిన మామిడికి సబ్సిడీ జూలైలో, జూలైలో సేకరిస్తున్న మామిడికి ఆగస్టులో రైతుల ఖాతాలకు జమ చేస్తామన్నారు. జిల్లా స్థాయిలో సేకరించి పంపిన రైతుల వివరాలు, తోతాపురి మామిడి తూకం, తదితర వివరాలను మండల అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులు గ్రామస్థాయిలోని విలేజ్ అగ్రికల్చర్, వీఆర్వోల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు.

ఎలాంటి అలసత్వం వద్దు

క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియలో ఎలాంటి అలసత్వం వహించకూడదని కలెక్టర్ ఆదేశించారు. రైతుల బ్యాంకుల ఖాతాలకు సంబంధించి బ్యాంక్ వివరాలు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్, ఈ క్రాప్‌ను తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. 2.25 లక్షల మెట్రిక్ టన్నులకు సంబంధించి 22,435 మంది రైతుల డేటాను మండల స్థాయి అధికారులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. రైతుల జాబితాను తయారు చేసి తహసీల్దార్ సంతకంతో ధ్రువీకరించాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడేల్, ఉద్యానవన శాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

వి.కోట : కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని గాండ్లపల్లి కొత్తూరు గ్రామానికి చెందిన వెంకట్రామప్ప కుమారుడు నారాయణస్వామి (35) పట్టణంలోని ఓ హోటల్‌లో పనిచేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఇతనికి భార్య భార్గవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. తాగుడుకు బానిసైన నారయణస్వామి కుటుంబాన్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తూ ఇంటికి సైతం వచ్చేవాడు కాదు. ఈ విషయమై భార్యతో తరచూ గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం తగుడు విషయమై డబ్బులు ఇవ్వలేదని భార్యతో గొడవ పడ్డాడు. ఆపై తీవ్ర మనస్తాపానికి గురైన నారయణస్వామి తన గ్రామ సమీపాన పొలంలోని చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

వ్యభిచార గృహంపై దాడి

గంగాధరనెల్లూరు: మండలంలోని చెర్లోపల్లి గ్రామం వద్ద నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై పోలీసులు దాడిచేసి కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం.. మండలంలోని పెద్ద కాలువ పంచాయతీ, చెర్లోపల్లి గ్రామం వద్ద ఓ ఇంటిని అద్దెకు తీసుకొని విజయ అనే మహిళ అక్రమంగా ఇతర రాష్ట్రాల నుంచి మహిళలను పిలిపించుకొని వ్యభిచార గృహం నిర్వహించేవారు. పక్కా సమాచారంతో పోలీసులు వ్యభిచార గృహం పై దాడి చేసి నిర్వాహకురాలిని, ముగ్గురు మహిళలను, ఇద్దరు విటులను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీడీ నెల్లూరు సీఐ శ్రీనివాసంతి తెలిపారు.

సమస్యల హోరు.. పరిష్కరించాలి మీరు!

- కలెక్టరేట్‌కు పోటెత్తిన సమస్యలు
- ప్రజాసమస్యల పరిష్కార వేదికకు తరలివచ్చిన అర్జీదారులు
- న్యాయం చేయాలంటూ వేడుకోలు
- వినతులు స్వీకరించిన కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ



సర్వే చేయించాలని కోరుతున్న అప్పినపల్లి గ్రామస్తులు



కలెక్టరేట్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న దివ్యాంగులు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు అర్జీదారులు పోటెత్తారు. సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తమ గోడును వెళ్లబోసుకున్నారు. అర్జీలు అందజేసి సమస్యలు పరిష్కరించాలని అధికారులను వేడుకున్నారు. కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డీఆర్వో మోహన్‌కుమార్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పలు సమస్యలపై 194 వినతులు వచ్చినట్లు కలెక్టరేట్ ఏవో వాసుదేవన్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సర్వే చేయించి సమస్య పరిష్కరించండి

సర్వే చేయించి సమస్య పరిష్కరించాలంటూ పెద్ద పంజాణి మండలం, అప్పినపల్లి గ్రామానికి చెందిన విజయభాస్కర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆ గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ తమ గ్రామంలో సర్వే నం.226/2లో ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భూమి తమ ఆధీనంలో ఉందన్నారు. భాగ పరిష్కారం చేసుకోకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలిపారు. ఆ భూమిలో సర్వే చేసి పాసుపుస్తకం మంజూరు చేయాలని కోరారు.

దివ్యాంగులంటే అలుసెందుకు?

కూటమి ప్రభుత్వానికి దివ్యాంగులంటే అలుసెందుకని దివ్యాంగుల హక్కుల అమలు జిల్లా కమిటీ మెంబర్ చంద్రశేఖర్ ప్రశ్నించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో దివ్యాంగులు నిరసన చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ పోస్టులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎందుకు భర్తీ చేయలేదని ప్రశ్నించారు. డీఆర్‌డీఏ ప్రోత్సాహంతో అవకాశాలు, 50 శాతం రాయితీతో దివ్యాంగులకు రుణాలు మంజూరు చేయాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో అర్హులైన దివ్యాంగులతో పోస్టులు భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

రూ.60 వేలు లంచం అడుగుతున్నారయ్యా

భూ సమస్య పరిష్కరించాలని కోరగా పెద్దపంజాణి తహసీల్దార్ కార్యాలయంలో రూ.60 వేలు లంచం అడుగుతున్నారంటూ బాధితుడు మార్కొండయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన విలేకరులతో మాట్లాడారు. పెద్ద పంజాణి మండలం, గళ్లావారిపల్లి గ్రామంలో పిత్రార్జితంగా తనకు భూమి ఉందన్నారు. 1బీలోనూ తన పేరు ఉన్నట్లు తెలిపారు. అయితే ఇటీవల 1బీలో తన పేరును తొలగించి వేరే వ్యక్తి పేరు నమోదు చేశారని ఆరోపించారు. న్యాయం చేయాలని తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వో శంకరప్ప, తలారి రాజన్నను కోరగా.. వారు రూ.60 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్‌కు తన సమస్య విన్నవించుకోగా విచారించి న్యాయం చేస్తామని చెప్పారన్నారు.



ఆవేదన చెందుతున్న రైతు మార్కొండయ్య

ఆధార్ కార్డులు లేవు సారూ

తమకు ఆధార్ కార్డులు లేవని, వెంటనే ఇప్పించండి సారూ..! అంటూ గుడిపాల మండలం ఎం కే.పురం, నరిగపల్లికి చెందిన ఒల్లమ్మ కోరారు. ఈ మేరకు పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ తాము ఎస్టీ కులానికి చెందిన వారమన్నారు. తమ కుటుంబంలో ఇంత వరకు ఎవ్వరికీ ఆధార్‌కార్డులు లేవన్నారు. తాను, తన భర్త, ముగ్గురు పిల్లలకు ఆధార్ కార్డులు లేకపోవడంతో సంక్షేమ పథకాలకు దూరమవుతున్నామన్నారు. పరిశీలించి ఆధార్‌కార్డు, రేషన్ కార్డులు ఇప్పించాలని కోరారు.



ఆధార్ కార్డులు ఇప్పించాలని కోరుతున్న అర్జీదారు ఒల్లమ్మ

పట్ట పగలే రెండు ఇళ్లల్లో చోరీ



బీరువాలను పగులగొట్టి చోరీ చేసిన దొంగలు

రొంపిచెర్ల: పట్టపగలే రెండు ఇళ్లల్లో దొంగలు పడి బంగారు నగలు, డబ్బును చోరీ చేసిన సంఘటన మండలంలోని చిచ్చిలివారిపల్లె పంచాయతీలో సోమవారం చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు, రావిళ్లవారిపల్లె గ్రామానికి చెందిన మోడెం రమణయ్య కుటుంబ సభ్యులు ఇంటికి తాళంవేసి వరినాట్లు వేసేందుకు పొలం వద్దకు వెళ్లారు. ఇదే అదునుగా చూసుకుని దుండగులు చోరీ చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో ఉన్న బీరువాలోని రూ.40 వేలు నగదు, 25 గ్రాముల బంగారు నగలు చోరీ చేసినట్లు గుర్తించారు. అదే గ్రామానికి చెందిన మోడెం చిన్నస్వామి కూడా ఇంటికి తాళం వేసుకుని, పొలం వద్దకు వెళ్లడంతో ఆ ఇంట్లో కూడా రూ. 5 వేల నగదును చోరీ చేశారని తెలిపారు. ఈ విషయాన్ని బాధితులు రొంపిచెర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

గుండె పోటుతో ఉపాధ్యాయుడి మృతి

బంగారుపాళెం: స్థానిక మేదరవీధిలో నివాసముంటున్న ఉపాధ్యాయుడు రమేష్ ఆదివారం రాత్రి గుండె పోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విశ్రాంత ఉపాధ్యాయుడు వాసుదేవనాయుడు కుమారుడు రమేష్ మండలంలోని ఎగువరాగిమానుపెంట దళితవాడలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. రమేష్ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. రమేష్ మృతి పట్ల పలువురు ఉపాధ్యాయులు విచారం వ్యక్తం చేశారు.



రమేష్(ఫైల్)

ఎరచ్రందనం కేసులో ఇద్దరికి ఐదేళ్లు జైలు

తిరుపతి లీగల్: ఎరచ్రందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న కేసులో ఇద్దరికీ ఒక్కొక్కరికి ఐదేళ్ల చొప్పున జైలుశిక్ష, ఒక్కొక్కరికీ రూ.3 లక్షల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎరచ్రందనం కేసుల విచారణ సెషన్స్ జడ్జి నరసింహమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. కోర్టు లైజిన్ ఆఫీసర్లు ఖ్యాతి, భాను ప్రసాద్ కథనం మేరకు.. 2018 జూలై మూడో తేదీ పీలేరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌కు అందిన సమాచారం మేరకు గానుగ చింత -రొంపిచర్ల మార్గంలో ఫారెస్ట్ సిబ్బంది వాహన తనిఖీ చేపట్టారు. ఒక కారు అతివేగంగా రావడాన్ని గుర్తించి ఫారెస్ట్ సిబ్బంది ఆ కారును ఆపగా, ఆపకపోవడంతో వెంబడించి పట్టుకున్నారు. కర్ణాటక, బెంగళూరు, ఆనేకల్ తాలూకా, జిగల గ్రామానికి చెందిన టి.మునియప్ప, కర్ణాటక, బెంగళూరు, ఆనేకల్లు తాలూకా, ఆడిగర కాలహళ్లికి చెందిన ఎస్. మంజునాథను అదుపులోకి తీసుకున్నారు. కారులో ఉన్న 60 కిలోల బరువు గల ఆరు ఎరచ్రందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. రొంపిచర్ల బీట్, పెండ్లి కనుమ అటవీ ప్రాంతంలోకి అక్రమంగా ప్రవేశించి ఎరచ్రందనం చెట్లను నరికి దుంగలుగా మార్చి బెంగళూరుకు తరలిస్తున్నట్టు నేరం అంగీకరించారు. పీలేరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. నేరం ఇద్దరిపై రుజువు కావడంతో న్యాయమూర్తి వారికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తి అరెస్ట్

బంగారుపాళెం: వ్యక్తిపై కత్తితో దాడిచేసిన కేసుకు సంబంధించి సోమవారం సాయంత్రం నిందితున్ని అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ నెల 14వ తేదీ మండలంలోని తుంబకుప్పం గ్రామానికి చెందిన రామ్‌విలాస్ పాస్వాన్‌పై అదే గ్రామానికి చెందిన అహ్మద్ బాషా కత్తితో దాడి చేశాడు. ఈ సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, అహ్మద్‌బాషాను తుంబకుప్పం క్రాస్ వద్ద అరెస్టు చేసినట్లు చెప్పారు.



నిందితుడ్ని అరెస్టు చూపుతున్న పోలీసులు

అధిక వడ్డీ పేరుతో బురిడీ!

- పలమనేరులో రూ.2 కోట్ల కుంభకోణం
- మర్కజ్‌కాంప్లెక్స్‌లో గతంలో వెలిసిన ఆఫీస్
- అధిక వడ్డీలిస్తామంటూ భారీగా వసూళ్లు
- ఆపై కనిపించకుండా పోయిన నిర్వాహకులు

పలమనేరు: పట్టణంలో ఇటీవల ఓ కార్యాలయాన్ని అన్ని హంగులతో ప్రారంభించిన ఓ వ్యక్తి పలువురి వద్ద అధిక వడ్డీలు ఇస్తామంటూ రూ.2 కోట్లకుపైగా వసూలు చేసి మోసం చేసిన ఘటన సోమవారం వెలుగుచూసింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గతంలో ఓ వ్యక్తి స్థానిక మర్కజ్‌కాంప్లెక్స్‌లో ఓ గదిని అద్దెకు తీసుకొని అందులో ఫైనాన్స్ కంపెనీని మొదలు పెట్టాడు. ఇందులో కొత్త స్కీమ్‌లు పెట్టి పది లక్షలు డిపాజిట్ చేస్తే తాము దాన్ని షేర్లలో పెట్టి అధిక వడ్డీలు ఇస్తామని ఆశ జూపాడు. దీంతో చాలామంది వీరివద్ద భారీగా డబ్బులు డిపాజిట్ చేసినట్టు తెలిసింది. ఆపై ఏమైందోగానీ ఆ కార్యాలయం మూతబడింది. నిర్వాహకుడు కనిపించకుండాపోయాడు. ఇలా ఉండగా పట్టణానికి చెందిన మసూద్ అనే బాధితుడు రూ.50 లక్షల వరకు డిపాజిట్ చేసి మోసపోయాడు. ఎలాగా సదరు నిర్వాహకుని ఆచూకీ తెలుసుకొని హైదరాబాద్‌లోని ఓ లాడ్జీలో ఉండగా వెళ్లి పట్టుకున్నాడు. ఆపై అతనిపై దాడిచేశాడు. తాను ఇచ్చిన డబ్బు తనకివ్వాలని, లేదంటే సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేస్తానని గట్టిగా హెచ్చరించాడు. దానికి సంబంధించిన విడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. ఇలావుండగా ఈ మోసంపై స్థానిక పోలీసులకు ఇంకా ఫిర్యాదు అందలేని తెలిసింది. త్వరలో దీనికి సంబంధించిన పూర్తి వివరాలు బయటపడే అవకాశం ఉంది.



నిర్వాహకుడిని ప్రశ్నిస్తున్న బాధితులు

పెన్షనర్ల ఆర్థిక ప్రయోజనాలు సకాలంలో చెల్లించాలి



బాలాజీ, ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు

చిత్తూరు కలెక్టరేట్ : పెన్షనర్ల ఆర్థిక ప్రయోజనాలను కూటమి ప్రభుత్వం సకాలంలో చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర అధ్యక్షులు బాలాజీ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సుదీర్ఘ కాలం ప్రభుత్వ సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన పెన్షనర్ల పట్ల చిన్నచూపు చూడటం సరికాదన్నారు. పెన్షనర్లకు అందాల్సిన ఆర్థిక ప్రయోజనాలు గ్రాట్యుటీ, ఆర్జిత సెలవులు, జీఐఎస్ తదితర బకాయిలను సత్వరం మంజూరు చేయాలన్నారు. సెప్టెంబర్ 2024 నుంచి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు ఇంత వరకు గ్రాట్యూటీ చెల్లించకపోవడం దారుణమన్నారు.

కోళ్లఫారంలో చోరీ

కార్వేటినగరం: పట్టపగలే కోళ్లఫారంలో చోరీ జరిగింది. ఈ ఘటన సోమవారం మేజర్ పంచాయతీ కార్వేటినగరం సమీపంలోని సుద్దగుంట వద్ద ఉన్న కోళ్లఫారంలో చోటుచేసుకుంది. కోళ్లఫారం యజమాని సాయికుమార్ కథనం.. సుద్దగుంట సమీపంలో ఉన్న కోళ్లఫారంలో అదే గ్రామానికి చెందిన గురవయ్య, లక్ష్మీపతి, సుబ్రమణ్యం పట్టపగలే కోళ్లఫారం తలుపులు పగులగొట్టి సీసీకెమెరాల వైయర్లను కట్ చేసి, అందులోని గ్యాస్ సిలిండర్, వంద కోళ్లు, ఇనుపరాడ్లు, ఫారంలో వాడే ఫీడర్లు డింకాలర్స్‌లను అపహరించినట్లు తెలిపారు. ఈ మేరకు సీసీ ఫుటేజీల ఆధారంగా గుర్తించి వారిని పట్టుకున్నట్లు తెలిపారు. ఆపై స్థానిక పోలీసులకు సమాచారం అందించినట్టు పేర్కొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 38 ఫిర్యాదులు

చిత్తూరు అర్బన్: నగరంలోని ఎస్పీ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 38 ఫిర్యాదులు వచ్చినట్టు ఎస్పీ ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ఎస్పీతోపాటు అడిషనల్ ఎస్పీ రాజశేఖరరాజు, డీఎస్పీ సాయినాథ్ కలసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఇందులో సైబర్‌క్రైమ్, వేధింపులు, కుటుంబ తగదాలు, నగదు లావాదేవీలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నట్టు పేర్కొన్నారు. వీటిని క్షుణంగా పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

నెట్ ఫలితాలు విడుదల

తిరుపతి సిటీ: జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, పీహెచ్‌డీ, వర్సిటీలు, కళాశాలల్లో అధ్యాపక పోస్టుల నియామకంలో ప్రధాన అర్హతకు యూజీసీ నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్) ఫలితాలు సోమవారం విడుదల చేశారు. గత నెల 18 నుంచి 21వ తేదీ వరకు జరిగిన ఈ పరీక్షకు ఎస్వీయూ పరిధిలో 4,578 మంది హాజరుకాగా 52 శాతం మంది అర్హత సాధించినట్లు సమాచారం.

శ్రీవారి దర్శనానికి 14 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ నారాయణగిరి చెట్ల వద్దకు చేరుకుంది. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 14 గంటలు పడుతోంది.

హామీలు తూచ్

కూటమి ప్రభుత్వంలో రైతులకు కష్టాలు తప్పడంలేదు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించడం లేదు. ముఖ్యంగా చిత్తూరు జిల్లాలో ప్రధాన పంట అయిన మామిడికి ఈ ఏడాది సరైన ధర అందకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కాయలు కోసి వాహనాల్లో ఫ్యాక్టరీలకు తరలించడానికి అయ్యే ఖర్చులు కూడా రావడం లేదు. దీంతో కాయలను చెట్లల్లోనే వదిలేస్తున్నారు. ఈ క్రమంలో జిల్లాలోని మామిడి రైతులు వామపక్షాల సహకారంతో ఆందోళన చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు.

- మామిడికి గిట్టుబాటు లేనట్టేనా..?
- కలెక్టర్ హామీలను బేఖాతర్ చేయని గుజ్జు పరిశ్రమలు
- నట్టేట మునిగిన మామిడి రైతులు
- పోరాటాలకు సిద్ధం కావాలంటున్న వామపక్షాలు



రూ.8 ఇస్తామని హామీ ఇస్తున్న జిల్లా కలెక్టర్

కార్వేటినగరం: చిత్తూరు జిల్లాలోని రైతులు ఎక్కువ మంది మామిడి పంటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 70 వేల హెక్టార్లలో మామిడి సాగవుతోంది. అందులో దాదాపు 60 వేల హెక్టార్లలో తోతాపురి రకం వుంది. ఆ కాయలను రైతులు గుజ్జు పరిశ్రమలకు తరలిస్తుంటారు. ఈ ఏడాది తోతాపురి కాయల దిగుబడి బాగా వచ్చింది. గిట్టుబాటు ధర అందకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. గత ఏడాది కిలో రూ.16 నుంచి రూ.20 వరకు పలికింది. ఈ ఏడాది రూ.2 నుంచి రూ.5 వరకు ధర పలుకుతుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

సిండికేట్ అయిన గుజ్జు పరిశ్రమలు

పంట దిగుబడి సమయానికి ముందే గుజ్జు పరిశ్రమలదారులు సిండికేట్‌గా మారారు. గత ఏడాది మామిడి పల్పు నిల్వ ఉంది అంటూ సాకు చూపి కాయలు కొనుగోలు చేయలేమని చేతులెత్తేశారు. ప్రభుత్వం కూడా తగిన చర్యలు తీసుకోకపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కాయలు కొనుగోలు చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికపోవడంతో పరిశ్రమల యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వ నిర్ణయించిన ధరకు కొనుగోలు చేయలేదు

కిలో మామిడికి రూ.12 చెల్లిస్తామని ప్రభుత్వం పేర్కొంది. ఇందులో పరిశ్రమల వారు రూ.8లు చెల్లిస్తారని, రూ.4లు ప్రభుత్వం సబ్సిడీ కింద ఇస్తుందని ప్రకటించింది. గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలు మాత్రం కిలో రూ.5ల చొప్పున మాత్రమే కొనుగోలు చేస్తామని సెల్‌ఫోన్ల ద్వారా రైతులకు మెసేజ్‌లు పంపుతున్నాయి. దీంతో ఏమి చేయాలో తెలియక రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో మామిడి చెట్లను నరికేశారు.

నాలుగురోజులైనా అన్‌లోడు కాలేదు



గంటల కొద్దీ పడిగాపులు కాసి టోకన్లు తీసుకొచ్చాను. కాయలను గుజ్జు పరిశ్రమకు పంపితే అన్‌లోడ్ అయ్యేందుకు నాలుగు రోజులు పట్టింది. ట్రాక్టర్ బాడుగ, కూలీలకు వెయిటింగ్ చార్జీ రూ.11 వేలు అయింది. మామిడి కాయలు 4 టన్నులు వచ్చాయి. గుజ్జు ఫ్యాక్టరీ కిలో రూ.5 చెల్లిస్తామని మెసేజ్ పెట్టింది. వచ్చే మొత్తం తోట దున్నకానికి, మందులకు కూడా సరిపోయేలా లేదు. ఇలాగైతే మామిడి సాగు చేయడం కష్టం.

– గోవింద మందడి, కనకమ్మ కండ్రిగ, కార్వేటినగరం.

పెట్టుబడి కూడా రాలేదు



నాకు సుమారు 15 ఎకరాల మామిడి తోట ఉంది. ఏటా 30 నుంచి 40 టన్నుల వరకు దిగుబడి వస్తోంది. మండీలకు, ఫ్యాక్టరీలకి తరలించి గిట్టుబాటు ధరకే అమ్ముకునే వాళ్లం. ఈ ఏడాది ఫ్యాక్టరీలు ఆలస్యంగా తెరవడం వల్ల సుమారు 15 టన్నుల వరకు కాయలు రాలిపోయాయి. 25 టన్నులు ఫ్యాక్టరీకి తరలిస్తే పెట్టుబడి కూడా రాలేదు. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల మామిడికి గిట్టుబాటు కలగ లేదు.

– లోకరాజు, ఎగువరాజుల కండ్రిగ, కార్వేటినగరం

బిల్లులు చూసి కంగుతిన్నా



ప్రభుత్వం ప్రకటించిన ధరకే కాయలు కొనుగోలు చేస్తారని ఫ్యాక్టరీకి తరలించాను. కిలోకు రూ.5 చెల్లిస్తున్నట్లు యాజమాన్యం నుంచి మెసేజ్ రావడంతో కంగుతిన్నాను. కూటమి ప్రభుత్వం, ఫ్యాక్టరీ యాజమాన్యం కుమ్మక్కై మామిడి రైతులను ముంచేసింది. గత ప్రభుత్వంలో ఇలా ఎప్పుడూ జరగలేదు.

– స్వామిరాజు, ఎగువ రాజులకండ్రిగ, కార్వేటినగరం

రైతన్నలకు వామపక్షాలు అండగా నిలవాలి



మామిడి గుజ్జు ఫ్యాక్టరీ యాజమాన్యం, కూటమి ప్రభుత్వం సిండికేట్‌గా మారి గిట్టుబాటు ధర కల్పించలేదు. దీంతో రైతులకు నిరాసే మిగిలింది. ఏజెంట్ల ద్వారా అమ్మకాలు జరిపించి రైతుల జేబులకు చిల్లుపడేలా చేశారు. ఇలా అయితే రైతు ఎలా బతకాలి. పంటలు ఎలా సాగు చేయాలి. వైఎస్సార్‌సీపీతో పాటు, అన్ని వామపక్ష పార్టీలు కలిసి రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చేంత వరకు పోరాటం చేయాలి

– వెంకటరెడ్డి, జిల్లా రైతు విభాగం మాజీ అధ్యక్షుడు, గంగాధరనెల్లూరు